# మధ్య [పిల్లా] తరగతి మర్యాదలు



గంగుల నరసింహారెడ్డి

"ఏమండీ......"

"ఊఁ"

"............"

"పిలిచి మాటాడవేం, ఏం జరిగింది ?"

"ఏం కాలేదండీ మరి..."

"నీళ్లు నమలక చెప్పేదువు."

"అదుగో మీకప్పుడే కోపం వచ్చేస్తుంది. నేనా మాటడిగితే మీకింకా కోప మెక్కువవుతుందేమో."

"అప్పుడేమోగాని నువ్విలా డొంకతిరుగుడుగా మాట్లాడుతుంటేనే..." అంటూ కోపంగా చూశాడు జనార్థనం.

"అయితే ఏమడగనులెండి, నేను పెదవి విప్పితేనే మీకు చిరాకెక్కువవుతుంది."

"చెప్పేదేదో సరిగ్గా చెప్పమంటున్నా."

"అదే... చీర, సంక్రాంతికి కొంటానన్నారు, కొనలేదు, ఉగాది కయినా..."

"చీరల గురించి తప్ప నీ కింకే ఆలోచనా రాదా, నీ కిప్పుడు చీరలు కరువయ్యాయా ?"

"ఉన్నాయి, ఎందుకు లేవూ మన చాకల్ది కట్టేవాటికంటే నాసిరకంవి చాలానే ఉన్నాయి" మూతి బిగించింది కౌసల్య.

"మన తాహతుకు తగ్గవి మనం కొనుక్కుంటాం కాని నీవేం ఆఫీసరు భార్యవి కాదుగా ఖరీదైన చీరలు కట్టడానికి, కేవలం బతుకలేని బడిపంతులు పెళ్లానివి."

"ఈ మాట చెప్పి నన్ను నోరు మెదపనీయరు, నేనేం గొంతెమ్మ కోరికలు కోరుతున్నానా, అన్నీ కట్టుడు చీరలే ఉన్నాయి. ఎక్కడికయినా వెళ్లేప్పుడు కట్టుకెళ్లడానికి ఒక మంచి చీరైనా లేదనీ..."

"సరే, ఉగాదికి కదా చూద్దాంలే, ఇప్పట్నుంచే పోరడమెందుకు ?"

"ఇట్లా అయితేనే మీరు ఒప్పుకుంటారని."

"నీకు తెలుసుకదా కౌసల్యా మన పరిస్థితి — మనమంతా బడ్జెట్ బతుకులు."

*   *   *

"ప్చ్, చీర తీసుకురాలేకపోయాను భారతీ, ఎంత కష్టపడ్డా లాభం లేకపోయింది" నీరసంగా అరుగుమీద కూర్చుంటూ అన్నాడు ప్రకాశం.

"అంతేనా..." అని తనూ నిస్పృహ చెందినా వెంటనే తేరుకొని "ఏమయింది, వడ్లు అమ్మలేదా?" అడిగింది భారతి.

"అమ్మాను కాని సావుకారి బాకీ జమ కట్టడానికే సరిపోయింది."

"పోనీలే ఏం చేద్దాం. వేసంగి పంటమీద తీసుకుందాం" అని అయితే అంది కాని ఇంకా రెండు మూడువెలలు ఈ చిరుగుల చీరతో ఎలా గడపాలనే ఆలోచిస్తుందామె. ఎక్కడికయినా వెళ్ల డానికి పెళ్లినాటి ఓ చీర ఇంకా ఉంది కాని ఇంట్లో కట్టుకోవడానికే చీరలు లేవు. ఉన్న రెండు చీరలు ఎన్ని చిరుగులు చిరుగుతున్నా కుట్టుకుంటూ కాలం గడుపుతుంది.

"ప్చ్ !" మరోమారు నిట్టూర్చాడు ప్రకాశం. తనకూ, భార్యాపిల్లలకు ఈరోజు బట్టలు తీసుకువద్దా మనుకున్నాడు. కాని షావుకారు మొత్తం డబ్బును అప్పు చెల్లింపుకు జమ చేసుకోవడంతో చేసేదిలేక ఉత్త చేతులతో ఇంటికి వచ్చాడు. అతనికున్న కొద్దిపాటి పొలంతో అతికష్టంమీద కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

"పోనీ, ఇప్పుడెందుకు ఆలోచన చేస్తావు, మనమేమన్నా చుట్టాలింటికి, పెండ్లిళ్లకు పోయేదుందా, ఎట్లనో ఈ మూడు నెలలు నడవని" అంది భారతి భర్తను అనునయిస్తూ.

*   *   *

"అబ్బా ఈనాటితో నేను ఋణ విముక్తుడ నయ్యాను సావిత్రీ" హాయిగా నిట్టూరుస్తూ అన్నాడు సుందరం. "ప్చ్, కాని తాతలు సంపాదించిన ఆస్తిని పోగొట్టుకున్నానే అని బాధనిపిస్తుంది" ఆ వెంటనే ఆవేదనగా అన్నాడు సుందరం.

"పోనీలెండి, మన బాధలకన్న ఆస్తి ఎక్కువా, అప్పులాళ్లకు భయపడుతూ ఎన్నాళ్లని తప్పించుకు తిరగ్గలం. మన అదృష్టం బావుంటే ఇంతకంటె ఎక్కువ భూమిని కొనగలం."

"అవునులే, అప్పులాళ్లను తప్పించుకొని భయం భయంగా తిరిగిన రోజుల్ని తలుచుకుంటే ఇప్పుడు కూడా భయమనిపిస్తుంది. మొత్తానికి ఎలాగో అంతా సర్దుబాటయింది."

"ఏమన్నా మిగిలిందా ?" అడిగింది సావిత్రి.

"ఆఁ, మూడు వందల రూపాయలు మిగిలాయి. రేపు ఆ డబ్బుతో మనకు బట్టలు కొనాలను కుంటున్నా."

"అవును, మళ్లీ సంవత్సరం దాకా బట్టల అవసరం ఉండదు."

"ఈరోజు నుండి మనం చాలా పొదుపుగా ఉండాలి సావిత్రీ. లేకుంటే నా ఈ గుమాస్తా ఉద్యోగంతో బతకడం కష్టం."

"అవునండీ, మనం మళ్లీ అప్పు మాత్రం చేయకూడదు."

తృప్తిగా తల పంకించాడు సుందరం.

## 2

"ఏమండీ ... "

"ఊఁ."

"............"

"ఏం జరిగింది, పిలిచి మాటాడవేం, చెప్పేదువు."

"నిజంగా ఏడువ వలసిన పరిస్థితే వచ్చిందండీ" అంటూ శుభలేఖ అందించింది కౌసల్య.

గుండెలో రైళ్లు పరిగెత్తాయి జనార్దనానికి.

"ఎవరిది పెళ్లి ?" కవరు తెరుస్తూ అడిగాడు.

"చూడండి మీకే తెలుస్తుంది."

అరనిమిషం తరువాత శుభలేఖను గిరాటేస్తూ "ఇటా ఒకరి పెళ్లి చేస్తూ మనల్ని చంపుతున్నాడు మీ అన్నయ్య. ఇంకా ఎంత మంది చచ్చారా మహానుభావునికి" కోపంగా అన్నాడు.

"వాళ్ల బరువునంతా మీరే మోస్తున్నట్లుగా, శుభమా అంటూ వాడు పెళ్లి చేస్తుంటే మీరు చచ్చారు గిచ్చారని అంటారేం, ఇంకా ఇద్దరున్నారు పెళ్లికి."

"ఉన్నారూ మన ప్రాణం తీయడానికి, ఇంకో ఇద్దర్ని కనమనకపోయావా ?" కసిగా అన్నాడతను.

"బావుంది మీ వరుస, వయసు కలువలేదని కానీ లేకుంటే వాడి చిన్నకూతుర్ని మన వేణుకు చేసుకునేవారం, బంధుత్వం పోయేట్లుంది" బాధగా అంది కౌసల్య.

"నీ బంధుత్వం పాడుగానూ, ఎరక్కపోయి నా ఖర్మానికి నిన్ను చేసుకున్నాను కాని నా కంఠంలో ప్రాణముండగా మీ వంశాన్ని ఈ ఇంటికి కోడలిగా తెస్తానా ?"

"మీకు ఛాన్సు దొరికితే మా వంశాన్ని తిట్టడం మొదలు పెడతారు కాని ఈ పెళ్లి గురించి ఆలోచించండి ముందు."

"అవును ఏం చేయాలి ?" అంటూ ఆలోచనల్లో పడి "ఎంత డబ్బు కావాలో" తనే మూలిగాడు నీరసంగా.

"పిల్లకే గాకుండా తల్లిదండ్రులకు కూడా బట్టలు తీసికెళ్లాలంటే నాల్గయిదువందలవుతాయి" అంది కౌసల్య.

"నాకేం పని లేదనుకున్నావా, లేక నీవు మీ అమ్మగారింటి నుండి తెచ్చిన మడులు మాన్యాలేమైనా ఇక్కడ మూలుగుతున్నాయనుకుంటున్నావా ? నేను మీ అన్నయ్య ఇంటిల్లిపాదికి బట్టలు తీసికెళ్లడానికి."

"తీసికెళ్తే అందరిలో బావుంటుంది ... "

"బావుంటుంది, ఎందుకు బావుండదు ? కాని తర్వాత మన గతి ?"

"............"

"ప్చ్, నాకంతా అయోమయంగా ఉంది. ఇప్పటికే ఎన్నో అప్పులున్నాయి" నిస్పృత్తువగా అన్నాడు.

"అందరూ తీసుకొచ్చినప్పుడు మనం ఉత్త చేతులతో వెళ్తే బావుంటుందా, అన్ని అప్పులకు తోడు ఇదో అప్పు. పిల్లకయినా బట్టలు తీసికెళ్లాలి."

"అయితే ఎంత డబ్బుకోసం ప్రయత్నించ మంటావు ?"

"కనీసం రెండు వందలయినా కావాలి."

"హూఁ..."

*   *   *

"ఏం చేద్దాం ?"

"ఏం చేద్దాం ?"

ఇద్దరి మనసుల్లోనూ ఇదే ప్రశ్న. చేతిలో శుభలేఖ పట్టుకొని వాళ్లలాగే అరగంట సేపటినుండి కూర్చొని ఉన్నారు. కరువులో అధిక మాస మన్నట్లుగా ఈ పెళ్లి వచ్చిపడింది.

"పెళ్లికి బట్టలు తప్పక తీసుకుపోవాలా భారతీ" అతనికీ తెలుసు, తీసికెళ్లాలని. కాని ఏం తోచక శూన్యమైన మనసుతో అడిగాడా మాటను.

"తీసుకుపోవాలి, తప్పుతుందా, నలుగుర్లో నగుబాటు కామూ."

"అవును, కాని ఆ పిల్లకు బట్టలు తెచ్చే మాట అటుంచి పెళ్లికి ఆ ఊరెళ్లడానికి నీకు, పిల్లలకు బట్టలు కూడా లేవే."

"అవును" నీరసంగా అంది భారతి.

"సావుకారు దగ్గర ఇంకో మూడు వందలయినా తీసుకోవాలి, సరిపోతాయా."

"హూఁ" బరువుగా అందామె.

"ఈ పనికిరాని మర్యాదల్ని చూస్తుంటే నాకు మంట పుట్టుకొస్తుంది..."

"అట్లనుకుంటే ఎట్లా, మనకు నష్టమేం లేదుగా, మళ్లీ మనకు బట్టలు పెడతారు."

"నష్టమెందుక్కాదు, మనకు అవసరం లేకున్నా, మనం కొనే స్థితిలో లేకున్నా ఆ పిల్ల పేరు మీదుగా మనకోసం మనం కొనడం మనకు నష్టం కాదూ !"

మౌనం వహించిందామె. ఏమని మాటాడ గలదు. భర్త మాటల్లోని నిజం ఆమెకూ తెలుసు కాని దానికి ఎదురీదగల శక్తి ఆమెకు లేదు. తోబుట్టువులందరిలోనూ ఆమె కుటుంబమే మరీ పేదది. ఆ భావనతోనే ఎప్పుడు సగం చచ్చి ఉంటే, మేనకోడలి పెళ్లికి బట్టలు తీసికెళ్లకుండా ఎలా వెళ్తుంది. అదీగాక ఆ పిల్లకు చిన్నప్పటినుండి కూడా తనంటే ఎంతో ప్రేమ. తనే ధనవంతు రాలయితే ఆ పిల్లకు ఏ పట్టుచీరో తీసికెళ్లేది.

"ప్చ్ !"

ఆ రోజు షావుకారు దగ్గరికి వెళ్లిన ప్రకాశం వాడిపోయిన ముఖంతో తిరిగొచ్చాడు.

"ఇంతకు ముందు తీసుకున్న బాకీ మొత్తం ఇచ్చాకగాని కొత్త అప్పు ఇవ్వనంటున్నాడు వాడు."

"మరేం చేద్దాం ?" ఆందోళనగా అడిగింది భర్తను.

అతని దగ్గరా ఇదే ప్రశ్న ఉంది.

దాని జవాబు కోసం ఇద్దరూ ఆలోచిస్తున్నారు.

*   *   *

"ఇప్పుడెట్లా, ఆ డబ్బుతో అప్పుడే మనం బట్టలు తీసుకోపోయినా బావుండేది, ఇప్పుడు చూడు ఈ పెళ్లి వచ్చిపడింది" సాలోచనగా అన్నాడు సుందరం.

ఈ వార్త తెలిసినప్పటి నుండి సావిత్రికి మనసు మనసులో లేదు. అన్నయ్య కూతురి పెళ్లి,

చేస్తున్నాడని సంతోషపడాలా లేక ఆ పెళ్ళికి తమకయ్యే ఖర్చు గురించి బాధపడాలా ఆమెకు అర్థం కావడంలేదు.

"ఎట్లా ?" అంది ఎటూ తోచక.

"అదే నా కర్థం కావడంలేదు. పెళ్ళికూతురికి బట్టలు తీసికెళ్లాలంటే ఎంత కావచ్చు ?"

"ఎంత లేదన్నా మాటయాభై కావాలి."

"మాటయాభై ..." గుండెలు గుబగుబ లాడినవి. ఈ నెలాఖరులో మాటయాభై రూపాయలంటే మాటలా ? పైగా పోయి రాను ఖర్చులు ఇంకో యాభై కావాలి ... రెండువందలు!

! రెండువందల రూపాయలు ఇప్పుడు అప్పుగా తీసుకున్నా వాటిని తొందరగా తీర్చడం తన తరం కాదు. వాటికి వడ్డీ మాత్రం కట్టగలదు.

మళ్ళీ అప్పుల బ్రతుకు !

"తప్పక తీసికెళ్లాలా బట్టలు ?" తనకు తెల్సు ఆమె నుండి వచ్చే జవాబు. అయినా అయో మయంగా అడుగుతున్నాడు.

"తీసికెళ్లపోతే ఎలాగండి, నలుగురిలోనగుబాటు కామూ."

"అంటే మనం ఆ పిల్లకు బట్టలు తీసికెళ్లేది నలుగురి కోసం ! అంతేకదూ."

"అంతేకదా మరి."

"శుభమా అంటూ ఆపిల్ల పెళ్లి చేసు కుంటుంటే మనం ఏడ్చుకుంటూ వెళ్లడం ఏం బావుంటుంది చెప్పు."

"మీ రనే దే మి టి, ఉత్త చేతులతో వెళ్లమంటారా ?"

"అలా అనడం లేదు. కానీ మన తాహతుకు తగినది, మనం ఇవ్వగలిగింది మాత్రం ఇద్దాం."

"మనం ఏం ఇవ్వగలమండి ?" చిరాకుగా అడిగింది.

"కోపగించుకోక ఆలోచించు సావిత్రీ, మన గుమాస్తా బతుకులకీ ఫాల్స్ ప్రిస్టేజీలు పనికిరావు. మనం అప్పుచేసి క్రుంగిపోతూ బట్టలు తీసుకొని వెళ్తాం. వాళ్లూ మర్యాదకు బదులుగా ఇంకొకరు తెచ్చిన బట్టలు మనకు పెడ్తారు. కాని ఈ ప్రాసెస్‌లో నష్టపోతుందెవరో ఆలోచించు. వాళ్ల పెళ్లిమీద అవసరం లేకున్నా అప్పుచేసి మనకోసం బట్టలు కొనుక్కుంటున్నాం."

## మధ్య[మిథ్య]తరగతి మర్యాదలు

ఏం మాట్లాడలేదు సావిత్రి. నిజమేనన్నట్లుగా అతని వంక చూసింది.

"ఆ అప్పు తీర్చడానికి మన మెన్నో అవస్థలు పడాలి. పదుల్లో అయితే ఎలాగో సర్దుకోవచ్చు. కాని వందల్లో అయితేనే మన జీవితాలు తల్లక్రిందు లవుతాయి. మనం వారంరోజుల క్రిందటనే అనుకో లేదూ అప్పు చేయకూడదని."

"అవును" నిరుత్సాహంగా అందామె.

"ఓ యాభై రూపాయలు ఎవరి దగ్గరైనా బదులు తెస్తాను. అందులోంచే ఓ రవికగుడ్డో, కుంకుంకాయో తీసుకెళ్దాం. వచ్చేనెల కాఫీ త్రాగడం మాని ఆ డబ్బు తీర్చేద్దాం."

"సరే" అంది సావిత్రి ముభావంగా.

### 3

పెళ్లి నుండి తిరిగివచ్చిన కౌసల్యకు మనసంతా అసంతృప్తిగా తయారయింది.

తను ఎంతో ఊహించుకొని వెళ్లింది. అన్నయ్య తనకేదో మంచి చీర పెడతాడనుకొని ఆశపడింది. కాని ఎవరో తెచ్చిన నాసిరకం చీర ముఖంమీద కొట్టి వెళ్లమన్నారు. ఛ్ఛ !

తను తీసికెళ్లిన లేతాకుపచ్చ రంగు చీర ఎంత బావుందో ?! తనకెంతో నచ్చిందది !

ఇక తనకు ఉగాదికి చీర కొంటాడా భర్త. కొనడుగాక కొనడు. ఈ పెళ్లికని చేసిన నూటయాభై రూపాయల అప్పు తీరేదాకా తను చీర గురించి అడగడానికి వీల్లేదు.

నూటయాభై రూపాయలు !

నెలకు పాతిక పొదుపు చేసినా ఆరు నెలలు కావాలి అవి తీరడానికి.

ఆరు నెలలు !!

తను ఎంత గర్వంగా తీసికెళ్లిందా పెళ్లి బట్టలు. ఇప్పుడేమో క్రుంగిపోతూ వచ్చింది.

కూతురి పెళ్లి చేసిన అన్నయ్య మీద అకారణం గానే కోపం వస్తుంది.

వెంటనే తనమీద తనకే కోపం వస్తుంది.

ఆ తరువాత తమ బ్రతుకులమీదే అసహ్యం కలుగుతుందామెకు.

* * *

ప్రియాతి ప్రియమైన మేనకోడలి పెళ్లికి బీదరికం కారణంగా వెళ్లలేకపోయానే అని మొదట్లో కొంత బాధపడ్డా ఇప్పుడు పూర్తిగా మర్చిపోయింది భారతి.

ఏం తీసికెళ్లకుండా వెళ్లలేదు. తీసికెళ్లడానికి డబ్బులేదు. అప్పుకు కూడా ఎవ్వరూ నమ్మడంలేదు. ఇంకేం చేయగలదు.

పెళ్లికి వెళ్లడం మానుకుంది.

ఇప్పుడు భారతికి తన దారిద్ర్యంమీద కాదు కోపం కలుగుతుంది, ఈ పనికిరాని మర్యాదలమీద.

* * *

పెళ్లినుండి సావిత్రి చాలా ఆనందంగా తిరిగి వచ్చింది.

వెళ్లేప్పుడయితే చాలా సిగ్గుపడుతూ, గిల్టీగా వెళ్లింది. అందరిలోనూ బిడియపడుతూ కూర్చుంది. తను తీసికెళ్లిన కుంకుమ భరిణను మేనకోడలి చేతిలో పెట్టడానికి సైతం ఆమె ఎంతో శక్తిని కూడదీసుకోవలసి వచ్చింది. ఆ క్షణాన — అప్పుడే తిరిగి వెళ్లిపోయి బట్టలు తీసుకువద్దామా అన్నంత బలీయమైన కోరికలో పడిపోయింద.

ఎలాగో పెళ్లి గడిచిపోయింది.

ఆమె అనుకున్నట్లు ఆమె ఎదుటనే ఆమె నెవరూ చిన్న చేసి మాట్లాడలేదు.

తను వస్తుంటే తన చేతిలో ఓ రవికగుడ్డ పెట్టారు. అదే చాలనుకుంది.

అప్పుల జీవితం మాత్రం తనకొద్దు. అందు కోసం తనెన్ని అవమానాలైనా భరించగలదు.

తృప్తిగా నవ్వుకుందామె.

* * *

"అబ్బబ్బా, ఎలాగో పెళ్లి అయిందనిపించాము. పెళ్లి చేయడమంటే మరేం కాదు, వచ్చిన బంధువు లను సంతృప్తిగా సాగనంపడమే. వాళ్లు "ఏవేవో" తీసుకురాకున్నాసరే మనం మళ్లీ వాటికి సమానమైన "ఏవేవో" ఇవ్వడం మాత్రం — అబ్బా తల బద్దలవు తుంది — ఈ మర్యాదల్ని ఎవడేర్పరచాడోగానీ..." బరువుగా నిట్టూర్చి తల పట్టుకునే ఉన్నాడింకా, తన కూతురి పెళ్లి చేసిన ఈ చెల్లెళ్ల అన్నయ్య. ★




